క్లుప్తంగా

సీపీఆర్ నిర్వహణపై శిక్షణ

చుంచుపల్లి: సీపీఆర్ నిర్వహణపై బుధవారం రుద్రంపూర్ గ్రామంలో పెనగడప పీహెచ్‌సీ వైద్యాధికారి అంబ్రీన్ నేహా అవగాహన కల్పించారు. ఎవరైనా స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు ముందుగా వారికి హృదయ స్పందన, శ్వాస, పల్స్ ఉన్నాయో లేదో గమనించిన తరువాత మాత్రమే సీపీఆర్ చేపట్టాలన్నారు. ముందుగా అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని ఒక చదునైన ప్రదేశంలో గాలి ఆడే విధంగా పడుకోబెట్టి సీపీఆర్ చేయాలని సూచించారు. మానిక్యూర్ యంత్రంపై సీపీఆర్ అంటే అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, రుద్రంపూర్ సర్పంచ్ సాగర్, కార్యదర్శి చెన్నకేశవులు వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ మాల సంఘం కమిటీ ఎన్నిక


మాల సంఘం నూతన కమిటీ సభ్యులు

పాల్వంచ: పాల్వంచ పట్టణ మాల సంఘం అధ్యక్షుడిగా కాల్వ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జగ్గం వినోద్‌లను ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొట్టు రాఘవేంద్ర, కోశాధికారిగా ఆనంద్, ముఖ్య సలహాదారులుగా తుంపురు వీరభద్రం, కల్లోజి రాజు, శ్రీను, కాల్వ అశోక్, బండి వీరకిరణ్, రాంబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాల్వ ప్రసాద్ మాట్లాడుతూ.. దళిత బంధును ప్రతి నిరుపేదకు అందేలా చూడాలని, మాల కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గడువు పెంపు

కొత్తగూడెంటౌన్: దివ్యాంగులకు వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా సహాయ ఉపకరణములు పొందేందుకు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మే 5వ తేదీ వరకు గడువును పెంచినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారిణి జేఎం స్వర్ణలత లెనీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటార్ వాహనములు, బ్యాటరీ వీల్ చైర్‌లు, ల్యాప్‌ట్యాప్‌లు, మూడు చక్రాల ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, చంకకర్రలు, అంధులకు ల్యాప్‌ట్యాప్‌లు, బదిరులకు 4జీ స్మార్ట్ ఫోన్స్, వినికిడి యంత్రాలు, మానసిక దివ్యాంగులకు బోధనా పరికరాలు కావాల్సిన వారు మే 5 లోపు httpr//tsobmmrcff.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు పాల్వంచలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పాల్వంచ మండలంలో పర్యటించనున్నారు. పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు పరామర్శ, శుభకార్యాల్లో పాల్గొంటారని క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో తెలిపారు.

పరామర్శ..


నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

చుంచుపల్లి: ఇటీవల కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. ఊకంటి గోపాలరావు, ఆళ్ల మురళి, తూము చౌదరి, మహేష్, ప్రసాద్ తదితరులున్నారు.

ఆదివాసీ మహాసభలను జయప్రదం చేయండి

జూలూరుపాడు: మే 5, 6వ తేదీల్లో భద్రాచలంలో జరిగే ఆదివాసీ గిరిజన మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పార్టీ మండల విస్తృత సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ మహాసభలకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరు కానున్నట్లు తెలిపారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

పాల్వంచరూరల్: వేసవికాలంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీఓ కనకదుర్గ కోరారు. మండల పరిధి కొత్తసూరారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పిల్లల బరువును సీడీపీఓ పరిశీలించారు. అనంతరం అన్నప్రాశన, సీమంతం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. కేంద్రంలో మొత్తం 59మంది పిల్లలు ఉండగా నలుగురు బరువు తక్కువగా ఉన్నారని వారికి బాలామృతం తినిపించాలని సూచించారు. పిల్లలను ఇంటికి పంపించేటప్పుడు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- కల్లాల్లో పేరుకుపోతున్న రాశులు
- దిగులు చెందుతున్న రైతులు
- సగం ధరకే కొనుగోలు చేస్తున్న దళారులు


రెడ్డిగూడెంలో కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం

పాల్వంచరూరల్: ధాన్యం సీజన్ రానే వచ్చింది. అప్పుడే అన్నదాతకు దగా మొదలైంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంబంధిత అధికారుల జాప్యంతో కల్లాల్లో ధాన్యం రాశులు పేరుకపోతున్నాయి. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి సగం ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసి దోపిడీ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో యాసంగిలో రైతులు 5,030 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. పంట చేతికి వచ్చింది. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలుదారుల కోసం నిరీక్షిస్తున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాలవర్షం వస్తే ధాన్యం తడిసి పోతుందని దిగులుచెందుతున్నారు.

దళారుల మాయాజాలం...

మండలంలో సహకార సొసైటీ ద్వారా ప్రతి సంవత్సరం రెడ్డిగూడెం, సోములగూడెం, నాగారం, దంతలబోరు, కారెగట్టు, గుడిపాడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. గతేడాది ఈపాటికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈసారి ఇంకా ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించ లేదు. ఆయా కేంద్రాల వద్ద రైతులు వందల క్వింటాళ్ల ధాన్యంతో నిరీక్షిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వ్యాపారులు 1010 రకం ధాన్యాన్ని 77కేజీల ధాన్యం బస్తాను రూ.1150 చొప్పున, హెచ్ఎంటి రూ.1980 చొప్పున కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో క్వింటా ధాన్యం సాధారణ రకం రూ.2,040, గ్రేడ్ ఏ రకం రూ.2,060 చొప్పున కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఇప్పటికే మండలంలో ప్రైవేట్ వ్యాపారులు రైతుల కల్లాల్లోకి వెళ్లి పచ్చివడ్లు కొని దోపిడీ చేసేశారు. మండలంలో గతేడాది యాసంగిలో సహకార సొసైటీ ద్వారా రూ.20వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ ఏడాది కూడా 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సొసైటీ లక్ష్యంగా నిర్దేశించింది.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలో జాప్యం చేయడం వలన అకాలవర్షం వస్తే ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అన్నదాతలను ఆదుకోవాలి.

– బాలినేని సుధాకర్, రైతు, సోములగూడెం

సగం ధరకే కొంటున్నారు..



ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంకా మొదలు కాకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రైతుల ఇళ్లకు వచ్చి సగం ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఉరుములు, మెరుపులకు భయపడి రైతులు కూడా తక్కువకైనా అమ్ముకుంటున్నారు.

– వేల్పుల లింగయ్య, రైతు, రెడ్డిగూడెం

వాతావరణంతో భయమేస్తోంది



కొనుగోలు కేంద్రం వద్ద 60 క్వింటాళ్ల ధాన్యాన్ని వారం రోజులుగా ఆరబోసి ఉంచాను. ఇంకా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. ధాన్యం తడిసి పోతుందేమోనని భయమేస్తోంది. కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి.

– నూకల రవీందర్‌రెడ్డి, రైతు, రెడ్డిగూడెం

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


మాట్లాడుతున్న రేగా కాంతారావు

పాల్వంచరూరల్: గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని పెద్దమ్మతల్లి గుడి వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం 6వ జిల్లా మహాసభ జరిగింది.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రేగా కాంతారావు జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు పేదప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం తరుపున శిక్షణ అందించి వారి సేవలను మెరుగు పరుస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో గ్రామీణ వైద్యులకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఆర్ఎంపీల సమస్యలను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

గుణపాఠం చెబుదాం..

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుతం అమల్లో ఉన్న ఎనిమిది గంటల పని విధానాన్ని కార్పొరేట్ సంస్థల కోసం 12 గంటలకు మార్చేందుకు కేంద్రం యత్నిస్తోందని ఐటీఎఫ్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.విశ్వనాథం ఆరోపించారు. మేడే వేడుకలను ఇఫ్టూ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టడమే కాక పనిగంటల పెంపునకు యత్నిస్తున్న మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్మికుల ఐక్యతను చాటేలా మేడే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కాపు కృష్ణ, నరసింహారావు, అలీమొద్దీన్, మురళి, అశోక్, కిరణ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపర్చాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎంలు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న పర్సనల్ విభాగంలో ఫైళ్లు పెండింగ్‌లో ఉండొద్దని, ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించిన ఏ ఫైల్ పెండింగ్‌లో ఉంటే సంబంధిత రిఫరెన్స్ అధికారి ఇవ్వాలని, జీరో పెండింగ్ విధానం తక్షణమే అమలు కావాలని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ అన్ని ఏరియాల జీఎంలకు, పర్సనల్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న జీఎంలతో, పర్సనల్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్లక్ష్యం స్తే చర్యలు తప్పవన్నారు. త్వరలో తాను అన్ని ఏరియాల్లోని వివిధ డిపార్ట్‌మెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఉద్యోగికి సంబంధించిన వ్యక్తిగత, ఉద్యోగ పరమైన ఏ ఫైల్ కూడా పెండింగ్‌లో ఉంచరాదని తెలిపారు. కార్మికుల సంక్షేమంలో భాగంగా క్యాంటిన్లను సంబంధిత అధికారులు విచారణ చేపట్టి కార్మికులను నాణ్యమైన అల్పాహారం అందించాలని సూచించారు. క్వార్టర్ల కేటాయింపును ప్రతి 15 లేదా నెలరోజులకోసారి కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల జాబితా తయారు చేయాలని, క్వార్టర్ ఖాళీ చేస్తేనే గ్రాట్యుటీ చెల్లించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం పర్సనల్ ఏ.కుమార్‌రెడ్డి, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, పర్సనల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి సన్మానం


జడ్జి పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి వసంత్‌పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి పాటిల్‌కు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, దుంద్ర రమేష్, కాసాని రమేష్, సంతోష్‌లాల్ సాహూ, పిట్టల రామారావు, యాస యుగేందర్, ఏ.మనోరమ, జీ.వీ.హరిప్రసాద్, జీ.కే.అన్నపూర్ణ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

చుంచుపల్లి: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశాల మేరకు బుధవారం కొత్తగూడెం పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను వైద్య బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్ మోయుద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్‌కు పూర్వవిద్యార్థుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాలకు సంబంధించిన 33 ఎకరాల స్థలం ఆక్రమణకు గురైందని, ఈ సంవత్సరం ఇంటర్మీడియట్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలని, మహిళా విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. కళాశాల ఆవరణలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో కళాశాల విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని, కళాశాల ఆవరణలో నిర్మించిన వార్ ట్యాంకు నుంచి కళాశాలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కన్వీనర్ వి.శాంతిరామ్, హరిగోపాల్, గెర్షోం, రామారావు, మంగపతిరావు, నాగయ్య, నరసింహారావు, మల్లేష్, కనకయ్య పాల్గొన్నారు.

వీఓఏల డిమాండ్లను పరిష్కరించాలి


ఇల్లెందు: వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు


ఇల్లెందురూరల్: రోడ్డు ఊడుస్తున్న వీఓఏలు

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 19న టేకులపల్లిలో ప్రారంభమైన వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బుధవారం పదో రోజుకు చేరింది. సమ్మెకు మద్దతుగా హాజరైన ఆదివాసీ సంఘాల జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ దొర మాట్లాడుతూ.. తెలంగాణలో ఐకేపీ వీఓఏలు వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని, ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి మూడ్ చరణ్, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, శిరోమణి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన వీఓఏలు రహదారులను ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు నబీ, తాళ్లూరి కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం వీఓఏల ఉద్యమాన్ని చిన్నచూపు చూడటం సరికాదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవ్య, పాపారావు, మోతీలాల్, వసంతరావు, నీలబాయి, కోక్యా, సుజాత, కోటమ్మ, సుమతి పాల్గొన్నారు.

ఇల్లెందు: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన ఆందోళనకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం ఇల్లెందు తహసీల్ ఎదుట దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. జీవీ భద్రం, ధారావత్ కృష్ణ, గోపాల్, ఆనంద్, తిరుమల్, కమల, జ్యోతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: రైతుల సంక్షేమమే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు బుధవారం బేతంపూడి సొసైటీ ఆధ్వర్యంలో బొమ్మనపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. మాట్లాడుతూ.. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఏఓ నీరుడు అన్నపూర్ణ, తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం, డైరెక్టర్లు ఉల్లోజు ఉదయ్, లక్కినేని శ్యామ్, దొర్నాల విజయ్‌మోహన్, భూక్యా బాలాజీ, సర్పంచ్‌లు ఎల్.శంకర్, ఆలియా, నీలమయ్య, సీఈఓ పాన్నోజు ప్రేమాచారి, ఏఈఓలు శ్రావణి, విశాల, రమేష్, రెహానా, భాగ్యశ్రీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

ఇల్లెందురూరల్: కార్యకర్తలకు అనునిత్యం అండగా ఉంటామని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల తీవ్రంగా గాయపడిన బానోత్ రమేష్, భూక్యా నాగరాజులను బుధవారం ఆమె పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తాతా గణేష్, ఘాజీ, బానోత్ వెంకటేష్, బింగి వెంకన్న, సూత్రపు సమ్మయ్య, బనీషా, సలీం తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు నిర్వహించండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, సత్తుపల్లిలోని కార్మికుల, ప్రభావిత ప్రాంతాల పిల్లల కోసం ప్రతి ఏడాది నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంపును ఏర్పాటు చేయాలని బుధవారం ఏరియా ఇన్‌చార్జ్ జీఎం సుధాకర్‌రావును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. జీఎం కార్యాయలంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈనెల 24 నుంచి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పిల్లలకు వాలీబాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హాకీ, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఆటలపై సమ్మర్ కోచింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ వేసవి క్యాంపు ద్వారా పిల్లలు చెడు వ్యసనాలకు లోను కాకుండా, ఆటలపై మక్కువ పెంచుకోవడానికి ఈ సమ్మర్ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్పందించిన జీఎం కార్పొరేట్ నుంచి ఉత్తర్వులు రాగానే సమ్మర్ క్యాంపు నిర్వహిస్తామని చెప్పారు.

ముగిసిన ‘ఉపాధి’ తనిఖీ


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బుధవారంతో ముగిసింది. 2020 నుంచి ఇప్పటి వరకు రూ.13 కోట్లతో 2,431 పనులు చేశారు. వీటికి సంబంధించి పది రోజులుగా సీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు గ్రామీణ ప్రాంతాలలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మస్టర్ రోల్‌తోపాటు, కూలీలకు ఇచ్చిన డబ్బులను పరిశీలించారు. శేషగిరినగర్ పంచాయతీలో పనులు చేయకపోయినా చేసినట్లు రికార్డు నమోదు చేసి డబ్బులు తీసుకున్నారని సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. బొజ్జలగూడెం రూ.86 వేలు, హర్యాతండా రూ.40 వేలు, మండలంలోని పలు పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులలో కొలతలు, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో రూ.65 వేలు జరిమానా విధించారు. మండలంలోని 31 పంచాయతీల్లో రూ.3.06 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది. ఈ తనిఖీలో అదనపు డీఆర్‌డీఓ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ అధికారి రమణారావు, అంబుడ్స్‌మెన్ ప్రకాష్‌రావు, ఎంపీడీఓ రామారావు తదితరులు ఉన్నారు.

మే డే ఘనంగా నిర్వహిద్దాం..


మాట్లాడుతున్న వెంకన్న

ఇల్లెందురూరల్: కార్మికుల హక్కుల పరిరక్షణ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్ల పర్మనెంట్ కోసం, నాలుగు కార్మిక లేబర్ కోడ్‌ల రద్దు డిమాండ్‌తో 137వ మేడే ను ఘనంగా నిర్వహించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. చికాగో అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పనిని నేడు కేంద్రంలోని మోదీ సర్కార్ 12 గంటలకు మార్చి కార్మికుల శ్రమను కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లను కుదించి కార్మిక హక్కులను హరించి వేస్తోందని ఆరోపించారు. కనీస వేతనం నెలకు రూ.27వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తోడేటి నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, డి.ప్రసాద్, సంజీవ్, సతీష్, జటంగి వెంకన్న, శ్రీనివాస్, నర్సింహారావు, రమేష్, వీరన్న, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను క్రమబద్ధీకరించండి


పాల్వంచరూరల్: ఎంపీడీఓ రవీంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ గడువు పూర్తయినా రెగ్యులరైజేషన్ చేయడం లేదని క్రమబద్ధీకరించే వరకు విధులకు హాజరయ్యేది లేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ జి.రవీంద్ర ప్రసాద్‌కు అందజేశారు. ఈనెల 28నుంచి సమ్మెలోకి వెళ్తున్న సందర్భంగా కార్యదర్శులు నిత్యం ఫోన్ యాప్ నుంచి నిష్క్రమించారు. డిజిటల్ కీని ఎంపీఓ నారాయణకు అందజేశారు. మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రణధీర్, కార్యదర్శులు రవికుమార్, రాజశేఖర్, రాధిక 36 గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

టేకులపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ దశలవారీ ఆందోళనలు కొనసాగుతున్నాయి. నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం టేకులపల్లి మండలంలోని 30 మంది జేపీఎస్‌లు పోలీస్‌స్టేషన్, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 28 నుంచి తలపెట్టిన సమ్మె లేఖలను అందజేశారు. జేపీఎస్‌ల సంఘం మండల అధ్యక్షుడు బంగారు సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ వెంటనే జీఓ విడుదల చేయాలని, గడిచిన నాలుగేళ్ల కాలాన్ని ప్రొబెషనరీ కాలంగా గుర్తించాలని విన్నవించారు. అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు ఇవ్వాలని, 317 జీఓ వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని కోరారు. పరస్పర బదిలీలు, స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శిరీషా, వరుణ్‌తేజ, దీప్తి, శరత్‌చంద్ర, దుర్గాభవానీ, రాజు, సౌజన్య, మీనాకుమారి, మంగీలాల్, రజిత పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పాఠశాలకు రక్షణ కరువు..

టేకులపల్లి మండలం రామచంద్రునిపేట పంచాయతీ తోలెం రామయ్యగుంపు (టీఆర్‌గుంపు) ప్రాథమిక పాఠశాలకు రక్షణ కరువైంది. ఈ పాఠశాలలో మొత్తం 16 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కరే టీచర్ ఉన్నారు. తాగునీరు, టాయిలెట్ల సదుపాయం ఉన్నప్పటికీ ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలోని ఫర్నిచర్, రికార్డులకు రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : ఠాకూర్ రాంసింగ్, ఎంఈఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 98495 53542

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416